క్లుప్తంగా...

ఎక్కడైనా ఉర్దూలోనే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ

చార్మినార్: నిత్య జీవితంలో ఉర్దూకు ప్రాధాన్యత ఇచ్చి ఇంట్లో, బయట ఎల్లప్పుడూ ముస్లిం ప్రజలందరూ ఉర్దూలోనే మాట్లాడాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ అన్నారు. అంజుమన్–ఈ–తరక్కీ–ఓ–బకా ఉర్దూ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది ఎజాజ్ అలీ ఖురేషీ ఆధ్వర్యంలో ఆదివారం మొఘల్‌పురాలోని ఉర్దూఘర్‌లో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఉర్దూను రెండో అధికారిక భాషగా పరిగణించి ఉత్తర ప్రత్యుత్తరాలు ఉర్దూలోనే ఉండాలన్నారు. ఇటీవల ఉర్దూ అకాడమీ ద్వారా అవార్డులు పొందిన పలువురు అధికార, అనధికార ఉర్దూ ప్రముఖులను ఈ సభలో అభినందించారు.

ఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీ అధ్యక్షుడిగా గంగాధర్



అబిడ్స్: ఎగ్జిబిషన్ సొసైటీ ఎకనామిక్ కమిటీ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ డి.గంగాధర్‌రావు ఎంపికయ్యారు. ఆదివారం ఎగ్జిబిషన్ గాంధీ సెంటినరీ హాల్‌లో జరిగిన ఎకనామిక్ కమిటీ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా డాక్టర్ డి.గంగాధర్‌రావు, ఉపాధ్యక్షుడిగా ఆదిత్యమార్గం, గౌరవ కార్యదర్శిగా జీవీ.రంగారెడ్డి, జాయింట్ సెక్రటరీగా ధీరజ్‌కుమార్ జైస్వాల్, కోశాధికారిగా డాక్టర్ టీఎస్.వంశీ తిలక్ ఎన్నికయ్యారు. మొత్తం 386 ఓట్లు పోలవ్వగా అందులో డాక్టర్ గంగాధర్‌రావుకు 232 ఓట్లు రాగా, ప్రత్యర్థి దేవేందర్ రెడ్డికి 145 ఓట్లు పోలయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకనామిక్ కమిటీ ఆధ్వర్యంలో నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. విద్యారంగ వ్యాప్తికి, సామాజిక సేవకు ఎకనామిక్ కమిటీ మరింత ఉత్సాహంగా పనిచేస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన డాక్టర్ గంగాధర్‌తో పాటు మిగతా పాలకవర్గాన్ని పలువురు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

చాంద్రాయణగుట్ట: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బీజేపీ సీనియర్ నాయకుడు తాడెం శ్రీనివాసారావు అన్నారు. బవసర్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో తానాజీనగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి...అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా తాడెం శ్రీనివాసారావు మాట్లాడుతూ.. మారుతున్న కాలానికనుగుణంగా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్ ప్రతినిధులు ఉమేష్, రాజేష్ జవాకర్, లక్ష్మణ్‌రావు, వివేకానంద్, దశరథ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గీత కార్మికులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేయాలి



పల్లె రవికుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మోపుదెబ్బ రాష్ట్ర కమిటీ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ చేతివృత్తులకు ఇచ్చిన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని గీత కార్మికులకు వర్తింపజేయాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోపుదెబ్బ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం గీతకార్మికుల కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... గీతకార్మికులకు ఆర్థిక సాయాన్ని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర కమిటీ చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, సెక్రటరీ జనరల్ సిద్దిరాములుగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, హైకోర్టు న్యాయవాది బాలసాని సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కోటలో మెట్టుమెట్టుకూ బొట్టు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలను పురస్కరించుకుని ఆదివారం కోటలోని నగీనా బాగ్ నుంచి అమ్మవారి ఆలయం వరకు ఉన్న మెట్లకు బొట్లు పెట్టి పూజలు నిర్వహించారు. గోల్కొండ కోట బోనాల ఆషాఢమాస జాతర ఉత్సవాలను పురస్కరించుకుని కోట మెట్లకు అలంకరణ చేయడం ఆనవాయతీగా వస్తుంది. ఇందులో భాగంగానే గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయం అమ్మవారి వృత్తిపని సంఘం ఆధ్వర్యంలో మెట్లకు బొట్టు పెట్టే కార్యక్రమం జరిగింది. అమ్మవారి బోనాలకు వారం రోజుల ముందుగానే బొట్ల కార్యక్రమం నిర్వహిస్తామని వృత్తిపని సంఘం అధ్యక్షుడు, పూజారి సాయిబాబాచారి అన్నారు.

కోట బోనాలకు వేళాయె..

- 22వ తేదీ నుంచి బోనాల ఉత్సవాలు ప్రారంభం
- గోల్కొండ కోట బోనాలకు భారీగా ఏర్పాట్లు
- ముస్తాబవుతున్న మహంకాళి ఆలయం

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 22వ తేదీ నుంచి జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢమాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శతాబ్దాల చరిత్ర గల కోట బోనాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. తెలంగాణలో మొట్టమొదటి సారిగా బోనాలు కోటలోనే ప్రారంభమైన తరువాత ఒక్కో వారం నగరంలోని ఇతర ఆలయాల్లోని అమ్మవార్లకు బోనాలు నిర్వహిస్తారు. అమ్మవారి బోనాలు రాష్ట్ర దేవాదాయశాఖ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వయంగా రాష్ట్రమంత్రులు అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఈ బోనాలు 9 వారాల పాటు జరుగుతాయి. మొదటి, 3వ, 7వ, 9వ బోనాలకు లక్షల సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. అయితే 3వ బోనం పూజకు ప్రత్యేకంగా ఇతర రాష్ట్రాల భక్తులు తరలివస్తారు.

- బోనాలు ఉత్సవాలు జరిగే రోజుల్లో కోటకు వచ్చే విదేశీ పర్యాటకులు బోనాలను ఎంతో ఆసక్తిగా తిలకిస్తూ ఫొటోలు, వీడియోలు తీసుకుంటారు.
- లంగర్‌హౌస్ నుంచి అమ్మవారి ఘటాల ఊరేగింపునకు ఎంతో ప్రత్యేకత ఉంటుంది.
- రాష్ట్ర సాంస్కృతికశాఖ వారు ప్రత్యేకంగా తయారు చేసిన దేవతామూర్తుల కటౌట్‌తో సిద్ధమైన వాహనాలను ఊరేగింపును భక్తులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తారు.
- కాగా పోతరాజుల విన్యాసాలు ఈ బోనాల ఉత్సవాలకు మరింత వన్నె తెస్తాయి.



బోనాల జులూస్‌లో పోతరాజుల విన్యాసాలు (ఫైల్)

- పోతరాజుల ఒళ్ళు గగ్గులు పొడిచే విన్యాసాలు చూడటానికి రెండు కళ్ల చాలవు.
- మరోవైపు శివసతుల పూనకాలు సైతం బోనాల ఉత్సవాల్లో ఒక ప్రత్యేక ఘట్టమని చెప్పవచ్చు.
- మొదటి బోనం రోజున రిసాలబజార్ నుంచి ప్రారంభమయ్యే నజర్ బోనం ఊరేగింపును తిలకించడానికి పెద్ద ఎత్తున ముస్లింలు సైతం తరలివస్తారు.
- ఇదిలా ఉండగా బోనాల ఏర్పాట్లలో అమ్మవారి వృత్తిపని వారు కీలకపాత్ర పోషిస్తారు.
- అమ్మవారి ఆలయ అలంకరణ, దుస్తుల సిద్ధం చేయడం మొదలుకొని పూజలకు కావాల్సిన ఏర్పాట్లన్నీ వృత్తిపని వారే చేస్తారు.
- బోనాల జాతర జరిగే ఉత్సవాలు రోజున కోట అధికారులు కోటలోకి ఉచిత ప్రవేశం కల్పించడం ఆనవాయితీగా వస్తుంది.
- ఊరేగింపుగా వచ్చే భక్తుల కోసం జలమండలి వారు తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా నీరు అందిస్తారు.
- అగ్నిమాపకశాఖ వారు మంటలు ఆర్పడానికి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తారు.
- వైద్య ఆరోగ్యశాఖ వారు కోటలోని వివిధ ప్రాంతాల్లో భక్తుల కోసం ఉచిత టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు.
- మరోవైపు ఉత్సవాల కోసం కోట మొత్తం సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.
- సాయుధ పోలీస్ బందోబస్తుతో పాటు మహిళా పోలీసులు కూడా విధులు నిర్వహిస్తారు.

తరతరాలుగా అమ్మవారికి సేవ ..



అమ్మవారికి వృత్తిపని వారు తరతరాలుగా సేవలు అందిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచి వృత్తిపని వారికి సరైన గుర్తింపు లభించింది. ఆలయ కార్యనిర్వహణాధికారి సలహాలు, సూచనల మేరకు వృత్తిపని వారు సకాలంలో తమతమ పనులు పూర్తి చేసుకున్నారు.

– సాయిబాబాచారి, అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు

చెత్త తరలింపునకు ఏర్పాట్లు

నాంపల్లి: పబ్లిక్ గార్డెన్ చెత్త తరలింపుపై ముదురుతున్న వివాదం అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. పబ్లిక్ గార్డెన్స్‌లో పేరుకుపోయిన చెత్తను తరలించడానికి జీహెచ్‌ఎంసీ ముందుకు వచ్చింది. దీంతో ఉద్యాన శాఖ, జీహెచ్‌ఎంసీ మధ్య నెలకొన్న వివాదానికి తెరపడింది. ఆదివారం పబ్లిక్ గార్డెన్స్‌లోని చెత్తను, మట్టికుప్పలను తరలించారు. కొంతకాలంగా పబ్లిక్‌గార్డెన్స్‌లో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండిపోయింది. పబ్లిక్‌గార్డెన్ పార్కు సిబ్బంది తొలగించిన చెత్త గుట్టలుగా పేరుకుంది. ఇటీవల ఈ చెత్తకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడం, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేయడం జరిగింది. ఈ విషయమై పబ్లిక్‌గార్డెన్స్‌లో వాకింగ్ చేయడానికి వచ్చే వాకర్స్ తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. చెత్త తరలింపుపై ముదురుతున్న వివాదం అనే కథనాన్ని సాక్షి దినపత్రిక ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు రంగంలోకి దిగారు. ఎట్టకేలకు చెత్తను తరలించే ఏర్పాట్లు చేశారు.



చెత్తను తరలిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

అమ్మవారికి వెండి విరాళం



గౌలిపుర: మహంకాళి మాతేశ్వరి భారత మాత ఆలయం, కట్టమైసమ్మకు గౌలిపుర చంపాపేట్‌కు చెందిన హైకోర్టు అడ్వకేట్ గురజాల భీమాచారీ దంపతులు వెండిని విరాళంగా అందజేశారు. ఆలయ అధ్యక్షుడు ఎర్మని కైలాష్ గంగపుత్రకు అమ్మవారి ప్రతి కోసం పావుకిలో వెండిని విరాళం అందజేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి ఈ.సుమన్‌కుమార్, కోశాధికారి బొడ్డు సాయిబాబా, ఏ.మధుసూధన్‌గిరి, ఏ. మహేందర్ గిరి తదితరులున్నారు.

గోవధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



మాట్లాడుతున్న సమైఖ్య గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్

సుల్తాన్‌బజార్: ఈనెల 29న బక్రీద్ సందర్భంగా గోవధ జరగకుండా గోవధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ గోశాలల సమాఖ్య గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ 540 చట్టం ప్రకారం నగరానికి పశువులను తీసుకురావడానికి అనుమతి లేదన్నారు. బక్రీద్ సందర్భంగా కొందరు గోవులను అక్రమంగా రవాణా చేస్తున్నారని, నగర సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సమైఖ్య ప్రతినిధులు మురళీధర్‌రావు, నాయుడు, బానోతు గణేష్, గడ్డం కిరణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో ముందుకు సాగాలి

సుల్తాన్‌బజార్: యువ సంగీత నృత్య కళాకారులు కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి ఆకాంక్షించారు. ఆదివారం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషానిలయంలో నాయక అభినయం ముగింపు సమావేశానికి కేవీ.రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సంగీత నృత్యాంశాలను రక్తి కట్టించడానికి సరైన భావ ప్రకటనకు తెలుగు, సాంస్కృత భాషలపై పట్టు అవసరమన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న అయ్యగారి శ్యామ్‌సుందరం మాట్లాడుతూ.. నవ్యనాటక సమితి ఆరున్నర దశాబ్దాల సాంస్కృతిక రంగ సేవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నృత్యగురువు వై.ఛలపతిశాస్త్రి, వసుంధర, సుధామాల, రేణుకా ప్రభాకర్, వేమరాజు విజయ్ కుమార్, బాలాజీ శర్మ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రమణాచారి, నృత్యగురువులు తదితరులు

ఆక్యుపంక్చర్ చికిత్సతో మానవాళికి మేలు



ఉత్తీర్ణులైన విద్యార్థినికి పతకాన్ని అందజేస్తున్న డాక్టర్ లక్ష్మణ్ తదితరులు

విజయనగర్‌కాలనీ: ఆక్యుపంక్చర్ వైద్య చికిత్సల ద్వారా ఎటువంటి రోగాన్నైనా నయం చేయవచ్చని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్యుపంక్చర్, నేచ్యురోపతి వారి ఆధ్వర్యంలో ఆదివారం మాసబ్‌ట్యాంక్ జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో 9వ స్నాతకోత్సవం నిర్వహించారు. ఆక్యుపంక్చర్‌లో డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. వైద్య విధానంలో ఆక్యుపంక్చర్ చికిత్సలకు ప్రస్తుతం ఆదరణ ఉందన్నారు. ఈ చికిత్సల వల్ల రోగులకు ఎటువంటి దుష్పరిణామాలు ఉండవన్నారు. నిర్వాహక సంస్థ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. ఆక్యుపంక్చర్ విధానంలో వ్యాధి మూలాన్ని కనిపెట్టి చికిత్సలు అందించడం ద్వారా జీవితంలో రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఫైనార్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఈసారి ఘనంగా బంగారు మైసమ్మ బోనాలు

చార్మినార్: హరిబౌలిలోని బంగారు మైసమ్మ ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా వినయ్ దిలీకర్ ఎంపికయ్యారు. ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు నూతన కమిటీ ఎంపికతో పాటు ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించడానికి పూర్వ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం హరిబౌలీలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సిరిగిరి పాపయ్య, నోముల ప్రకాష్ యాదవ్, ధనుంజయ ముదిరాజ్, ప్రవీన్‌కుమార్ గౌడ్, హన్స్‌రాజ్ అనంతోజ్, శ్రీధర్, సంజయ్, నగేష్ షిండే పాల్గొని నూతన అధ్యక్షుడిని ఎంపికచేశారు. వినయ్ దిలీకర్ మాట్లాడుతూ.. ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాలను ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

బోనాల జాతరకు భారీ బందోబస్తు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తామని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభంకానున్న కోట బోనాల పూజ, ఆహ్వానపత్రంతో పాటు నజర్ బోనంకు బందోబస్తును ఏర్పాటు చేయాలని నజర్ బోనం నిర్వాహకులు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. కోట బోనాలను రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున నిర్వహిస్తుందని ఇందుకు పోలీస్ శాఖ సైతం అంతే స్థాయిలో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. గోల్కొండ రిసాలబజార్ నుంచి ప్రారంభంకానున్న మహంకాళి అమ్మవారి నజర్ బోనం ఊరేగింపునకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బోనం నిర్వాహకులు, శ్రీజగదాంబిక మహంకాళి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి ఇన్‌స్పెక్టర్‌ను కోరారు. కోట బోనాల ఏర్పాట్లలో వివిధ రకాల కులవృత్తుల వారు అమ్మవారికి సేవలు అందిస్తున్నారని, ఇందులో భాగంగానే నజర్ బోనం కూడా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆయన ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

ప్రతి వర్షపు బొట్టునూ ఒడిసిపట్టాలి

గోల్కొండ: నీరు ఎంతో విలువైందని, భూగర్భ జలాలను కాపాడుకోవడానికి భూమిపై కురిసిన ప్రతి వర్షపు బొట్టును ఒడిసిపట్టి భూగర్భ జలాల నీటిమట్టాన్ని పెంచుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన నానల్‌నగర్ డివిజన్ కాకతీయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వర్షపునీటి గుంతలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీటి వనరులు కూడా పెరగాలని దీని కోసం ఇంకుడుగుంతల ఏర్పాటు తప్పనిసరి అని ఆయన అన్నారు. నీరు ఎంతో విలువైందని, సకలమానవాళికి నీరే జీవనాధారం అని ఆయన అన్నారు. కాలనీలోనే కాకుండా బస్తీలలో సైతం ఇంకుడుగుంతల ఏర్పాటు బస్తీ కమిటీ, కాలనీ సంక్షేమ సంఘాల వారు పాటుపడాలని ఆయన అన్నారు. ప్రభుత్వం కూడా నీటిగుంతల ఏర్పాటుకు ఎంతో ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ జలమండలి డీజీఎం ఖాజా జౌహర్ అలీ, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్ ఫరాన్ తదితరులున్నారు.



ఇంకుడుగుంతలో ఇసుక వేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

సంక్షేమ పథకాలతోనే బీఆర్‌ఎస్‌కు ఆదరణ

అబిడ్స్: సంక్షేమ పథకాలతోనే బీఆర్‌ఎస్‌కు తెలంగాణతో పాటు దేశ నలుమూలలా ఆదరణ లభిస్తుందని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవడం గర్వకారణమన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పప్పుమాత్రే, కోటి శైలేష్ కురుమ, ప్రదీప్‌రాజ్‌తో పాటు పలువురు నాయకులు హోంమంత్రిని కలిశారు. దశాబ్ది వేడుకల్లో సందర్భంగా గోషామహల్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలపై వారు హోంమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో అన్నివర్గాల ప్రజలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. పలు రాష్ట్రాల ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రగతి, అభివృద్ధిని ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు.



హోంమంత్రిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు పప్పుమాత్రే, ప్రదీప్‌రాజ్, శైలేష్ కురుమ తదితరులు

సమాజ సేవకే వాసవీ క్లబ్ అంకితం



కార్యక్రమంలో పాల్గొన్న నాగమళ్ల శ్రవణ్‌కుమార్, వరకుమార్ గుప్తా తదితరులు

అబిడ్స్: సమాజ సేవకే వాసవీ క్లబ్ హైదరాబాద్ అంకితమని ఆ క్లబ్ మాజీ అధ్యక్షుడు నాగమళ్ల శ్రవణ్ కుమార్, బాశెట్టి గోపాల్ పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరంతర సామాజిక సేవా కార్యక్రమాలు వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయన్నారు. మెగా అమావాస్య వేడుకలను పురస్కరించుకుని క్లబ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలకు చీరలు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమళ్ల శ్రవణ్‌కుమార్, బాశెట్టి గోపాల్ మాట్లాడుతూ.. వాసవీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రతి సంవత్సరం అన్నివిధాల సామాజిక సేవలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు వరకుమార్‌గుప్తా, ప్రాజెక్ట్ చైర్మన్ మేడం రాంబాబు, వైస్ ప్రెసిడెంట్ నాంపల్లి శ్రీనివాస్, కో ప్రాజెక్ట్ చైర్మన్‌లు మురళీశెట్టి గౌరీశంకర్, పారెపల్లి నర్సింహ, బెజ్జం సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి

నాంపల్లి: ప్రముఖ సంగీత విద్వాంసులు, కళారత్న డి.శేషాచారి శిష్యులు అజయ్ వెంకట కిదాంబి గాత్ర కచేరి అలరించింది. ఈ మేరకు ఆదివారం కీర్తన ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఆరంగేట్రం జరిగింది. ఈ సందర్భంగా అజయ్ వెంకట కిదాంబి శిష్య బృందం అద్భుతంగా ప్రదర్శన ఇచ్చారు. బంగాళ రాగంలో గిరిరాజ సుత, కపి నరయాని రాగంలో సరస సమాధాన, పంతు వరలి రాగంలో అప్పరామ భక్తి, శంకరాభరణం రాగంలో సరోజ దళనేత్రి గీతాలకు గాత్రం చేసి అందరిని ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్ బ్రదర్స్ డి.రాఘవాచారి, డి.శేషాచారి హాజరై కళాకారులను అభినందించారు. అనంతరం గురు సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో సాయికుమార్ కోలంక వయోలిన్‌పై, సీహెచ్ రామకృష్ణ మృదంగంపై వాయిద్య సహకారం అందించారు.



రాఘవాచారిని సత్కరిస్తున్న దృశ్యం

అమావాస్య పూజలు

లంగర్‌హౌస్: గుండు పోచమ్మ ఆలయంలో అమావాస్య పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ వసంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పంచామృతాభిషేకాలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు పెద్దయెత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్‌యాదవ్, సభ్యులు శ్రీకాంత్, దిలీప్ కుమార్, విజయలక్ష్మి, నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్‌బిలాల్ పేర్కొన్నారు. మహారాణా ప్రతాప్ విగ్రహ నిర్మాణానికి రూ.5 లక్షలు నందకిశోర్ వ్యాస్ స్వయంగా విరాళంగా ఇచ్చారు. నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ప్రజలు నివసిస్తారన్నారు. నియోజకవర్గంలోని అన్ని రాష్ట్రాల ప్రజలకు తాను అండగా ఉండి వారి సంక్షేమానికి, వారి అభివృద్ధి, వారి ప్రగతికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మహారాణా ప్రతాప్ విగ్రహ నిర్మాణానికి తాను ఆర్థిక సహాయం అందజేయడం తనకెంతో తృప్తినిచ్చిందని నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహం తయారు చేస్తున్న కళాకారుడు సుందర్ కళాకార్ లోధ్, క్షత్రీయ రాజ్‌పుత్ అధ్యక్షుడు ఠాకూర్ సురేందర్ సింగ్, సభ్యులు వికాస్ సింగ్, ప్రవీణ్ సింగ్, సుచిత్ సింగ్, రఘు సింగ్, మహేందర్ సింగ్, గోపాల్ సింగ్, సంతోష్ సింగ్, పార్టీ నాయకులు బల్‌దీప్ సింగ్, తుల్జారామ్ సింగ్, టంపుశర్మ పాల్గొన్నారు.

అన్ని దానాలకన్నా అన్నదానం గొప్పది



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సంఘం సభ్యులు

గౌలిపుర: అన్ని దానాలకన్నా అన్నదానం ఎంతో గొప్పదని లాల్‌దర్వాజ గౌలిపుర ఆర్యవైశ్య సంఘం చైర్మన్ శ్రీరాం కోటయ్యగుప్తా అన్నారు. ప్రతినెలా అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం గౌలిపుర బతుకమ్మ బావి వద్ద గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వైశాఖ అమావాస్య సందర్భంగా పరమశివునికి విశేష పూజలు, రుద్రాభిషేకం, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. సలహాదారులు చీల రాములుగుప్తా, విశ్వేశ్వరయ్యగుప్తా, అధ్యక్షులు శ్రీధర్, మల్లికార్జున్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సరాబు సంతోష్‌గుప్తా, కోశాధికారి కొల్కూరి నర్సింహులుగుప్తా, ఆర్గనైజింగ సెక్రటరీ ఇరుకుల్ల భిక్షపతిగుప్తా, సభ్యులు గుబ్బ శ్రీనివాస్, ముక్క శేఖర్, శిరంగి సంతోష్, లోకనాథ్, గౌరిశెట్టి విశ్వనాథం పాల్గొన్నారు.